# స్మృతి పరిమళం



పరండాలో మంచం మీద కూర్చుని ఉన్నాడు కేశవరావు. గంట నుంచీ గేటు బయట తిరిగే మనుషులనీ, రోడ్డు మీద పోయే రిక్షాలనీ, ఆటోలనీ చూస్తూ ఉన్నాడు. లోపల గదిలో పిల్లలు టి.వి. పెద్ద సౌండు పెట్టుకుని కార్టూన్ నెట్‌వర్క్ చూస్తున్నారు. పక్కగదిలో కొడుకు పేపర్ చూస్తూ ఉన్నాడు. కోడలు వంటింట్లో ఉంది. పిల్లలు టి.వి. దగ్గర్నుంచీ ఇప్పుడిప్పుడే కదిలేటట్లు లేరు. రోడ్డు మీదకు చూసీ,చూసీ విసుగెత్తిపోతోంది కేశవరావుకు. "పిల్లలూ! ఇటు రండి" పిలిచాడు. మనవడూ, మనవరాలూ "ఆ(" అన్నారేగానీ అక్కడ నుంచీ కదలలేదు. మరో రెండుసార్లు పిలిచాడు. కోడలు వంటింట్లో నుంచీ వచ్చి టి.వి. ఆఫ్ చేస్తూ "తాతయ్య పిలుస్తూంటే వినిపించడంలా! వెళ్ళండి" అన్నది. మనవడూ,మనవరాలూ విసుక్కుంటూ వచ్చి "ఏమిటి తాతయ్య!" అన్నారు. "ఇలా కూర్చోండర్రా!" చేయి పట్టి మంచం మీద కూర్చోబెట్టాడు. "మీకు చక్కటి పద్యాలు చెప్తాను. చిన్న చిన్న పదాలతో బాగుంటాయి పలకండీ! ఉప్పుకప్పురంబు ఒక్క పోలిక నుండు......" టీచర్‌గా చేసి రిటైరైన కేశవరావు అలవాటు ప్రకారం అన్నాడు.

– గోనుగుంట మురళీకృష్ణ

"అబ్బబ్బా! తాతయా! సండే కూడా చదువేనా? రోజూ స్కూల్లో క్లాసులు, స్టడీ అవర్లు. ఇంటికొస్తే హోవర్కు. ఇంక మాకు రెస్ట్ ఎప్పుడు? అన్నాడు మనవడు. కేశవరావు ఒక్క క్షణం మౌనంగా ఊరుకున్నాడు.

"సరే! నా దగ్గర చందమామ పుస్తకం ఉంది. బోలెడు మంచి కథలున్నాయి. చదువుకుందాం" అన్నాడు.

"అవేమన్నా ఎగ్జామ్స్‌లో వస్తాయా! అవి చదవడం ఎందుకు? అసలు స్కూల్లో తెలుగు మాట్లాడితే మా మేడం ఫైన్ కూడా వేస్తారు" అన్నది మనవరాలు.

ఇద్దరూ లోపలికి వెళ్లిపోయారు.

"నాన్నా! వాళ్ళనెందుకు ఇబ్బంది పెడతావు? ఏదో ఆదివారం ఒక్కరోజు సెలవు. సరదాగా టీ.వీ. చూడనీ!" అప్పటికే అవన్నీ వింటున్న కేశవరావు కొడుకు అన్నాడు.

"ఇబ్బందేమిట్రా! రకరకాల పుస్తకాలు చదివితే మనసు వికసిస్తుంది. ఎప్పుడూ టీ.వీ. ముందు కూర్చుంటే స్థూలకాయం వస్తుంది" అన్నాడు.

కొడుకు సమాధానం చెప్పలేనట్లు చూసి ఊరుకున్నాడు.

కేశవరావు నిట్టూర్చాడు. "ఏం పిల్లలో! చక్కగా ఆటలు ఆడకుంటూ శరీర ధారుఢ్యం పెంచుకోవడం లేదు. మంచి పుస్తకాలు చదివి తెలివి తేటలు పెంచుకోవడం లేదు. ఎప్పుడు చూసినా ఆ టీ.వీ. ముందు కూర్చోవడం, లేదా బండెడు పుస్తకాలు ముందేసుకుని హోంవర్కు చేస్తూ ఉండడం.

తన చిన్నపుడు ఇలాగా! చందమామ, బాలమిత్ర, బొమ్మరిల్లు, బుజ్జాయి, బాలానందం, బాలభారతి, జాబిల్లి ఎన్ని పిల్లల పుస్తకాలో! తన స్నేహితులందరి ఇళ్ళల్లో ఒక్కొక్కరి దగ్గర ఒక్కొక్క పుస్తకం ప్రతి నెలా తెప్పించుకునేవాళ్ళు. ఒక పుస్తకం చదవడం అవగానే ఒకరిదొకరు మార్చుకుని చదివేవారు.

నాలుగవ తరగతిలో ఉండగానే రామాయణం, భారతం, భాగవతం మొదలైన కథలన్నీ తెలిసేవి. అవన్నీ పుస్తకాల్లో సీరియళ్ళుగా వచ్చేవి. అవన్నీ చదవడం అలవాటైన మీదట పాఠాలన్నీ ధారళంగా చదవడం వచ్చేది.

అసలు బడిలో చేరకముందే కేశవరావు వాళ్ళ నాన్న ఉదయాన్నే నిద్రలేపి తెలుగు సంవత్సరాలు, తెలుగు నెలలు, తిథులు, వారాలు, నక్షత్రాలు ప్రతి రోజూ చెప్పేవాడు. పలక మీద అవన్నీ రాయించేవాడు. రాత్రి పడుకోబోయేటప్పుడు కూడా అవన్నీ చెప్పించేవాడు. తను తండ్రి దగ్గర పడుకుని అవన్నీ నేర్చుకునేవాడు.

బళ్ళో చేరేరోజు ఎంత సందడిగా ఉండేదనీ! ఇప్పటి పిల్లల్లాగా బడికెళ్లనని మారాం చేయడం అనేదే లేదు. తనకు కొత్త లాగూ, కొత్త చొక్కా తొడిగి పలకకి పసుపు రాసి తీసుకువచ్చారు. మాస్టారు ఒళ్ళో కూర్చోబెట్టుకుని అక్షరాలు దిద్దించారు. ఆయన అక్షరాలు దిద్దిస్తుంటే తెల్లటి చేతికి అయిదు వేళ్ళకూ అయిదు ఉంగరాలు మెరుస్తూ కనిపించేవి.

పిల్లలందరికీ మరమరాలు, సెనగపప్పు,

కథ



బెల్లం పంచి పెట్టారు నాన్న. కొంచెం డబ్బున్న వాళ్ళైతే పలక, బలపాలు కూడా పంచేవారు.

ఇంటికొచ్చిన తర్వాత ''అమ్మా! నేను పెద్దయిన తర్వాత తెల్లమేస్టారులాగా, బళ్ళో ఉద్యోగం చేస్తానే!'' అనేవాడు.

''మా కేశవ బంగారుకొండ'' అని ముద్దు చేసి అమ్మ బెల్లంముక్క ఇచ్చేది తింటానికి. అది తీసుకుని తింటూ, గంతులు వేస్తూ వసుంధర వాళ్ళ ఇంటికి వెళ్ళేవాడు.

వసుంధర వాళ్ళ ఇల్లు తమ ఇంటి వెనకే ఉండేది. ఆ కుటుంబానికీ, తమ కుటుంబానికీ విడదీయరాని మైత్రి ఉండేది. వాళ్ళ అమ్మ కేశవ వాళ్ళ అమ్మతో, వాళ్ళ అన్నయ్య తన అన్నయ్యతో, వాళ్ళ అక్క తన అక్కతో స్నేహం చేసేవాళ్ళు. అలాగే వసుంధర, తను క్లాస్‌మేట్స్.

ఆ రోజుల్లో తను, వసుంధర, భానుమతి, శీను, గోపి, కుసుమ,రామూ ఒక జట్టు. కుసుమ వాళ్ళింట్లో బొమ్మల పెళ్ళి చేసేవారు. ''అన్నయ్య! నా బొమ్మకి పెళ్ళికొడుకుగా ఎవరూ లేరు...నువ్వు కూర్చో అన్నయ్యా!'' అని మారాం చేసేది. కుసుమ అన్నయ్య తనకన్నా రెండేళ్ళు పెద్ద. అతన్నీ బొమ్మనీ పీటల మీద కూర్చోబెట్టి పెళ్ళి చేసేవారు.

మర్రి ఆకులు తెచ్చి అరిటాకులు అని వేసేవాళ్ళు. ఉత్తుత్తి భోజనం పెడితే అందరూ తిన్నట్టుగా అభినయించి పంపుదగ్గర చేతులు కడుక్కునే వారు.

ఊరిబయట పెద్ద చెరువు ఉండేది. చెరువు నిండా ఎరుపు, తెలుపు తామర పూలు ఉండేవి. ఆ పూలకోసం చెరువులో దిగి, తామర తూళ్ళు కాళ్ళకు చుట్టుకుని ఒకరిద్దరు పిల్లలు చనిపోయిన సంఘటనలు ఉన్నాయి. అందువల్ల పెద్దవాళ్ళు పిల్లల్ని ఆ చెరువులో దిగడానికి అనుమతించే వారు కాదు. కేశవ, శీను, గోపీ...ముగ్గురూ రహస్యంగా దిగి పూలు కోసి, కాడలు తుంచి, దండ తయారు చేసి చెరువు గట్టున ఉన్న వినాయకుడి రాతి విగ్రహం మెడలో వేసేవాళ్ళు.


చెరువుకు కొంచెం దూరంలో కాలువ ఉంది. కాలువపైన ఉన్న వంతెన మీద నిలబడి బట్టలు ఆరబెట్టుకుని ఏమీ జరగనట్టుగా ఇంటికి వచ్చే వాళ్ళు.

ఆ కాలువలో అప్పుడప్పుడు పడవలు వెళుతుండేవి. వంతెన కింది నుంచీ వెళ్ళేటప్పుడు చూడడానికి స్నేహితులందరూ అక్కడికి వచ్చేవాళ్ళు. పడవలోనే ఇసుక పోసి, మూడు రాళ్ళు పెట్టి చిన్న చిన్న పుల్లలతో పడవవాళ్ళు వంట చేసుకునే వాళ్ళు. ఒక్కోసారి ఒడ్డున ఉన్న చెట్టుకు లంగరు వేసి, ఒడ్డు మీద వంట చేసుకునే వాళ్ళు. అవన్నీ చూడటానికీ చాలా ఆహ్లాదంగా ఉండేవి.

మగపిల్లలందరూ బిళ్ళంగోడీ, బెచ్చాలు, దొంగ-పోలీసు మొదలైన ఆటలు ఆడేవారు. బెచ్చాలాటలో ఓడినవాళ్ళు గెలిచిన వాళ్ళని వీపు మీద ఎక్కించుకుని గుర్రంలా కొద్ది దూరం నడవాలి. ఒకసారి రామూ ఓడిపోయాడు. రామూ ఆ ఊరి హెడ్మాస్టరు కొడుకు.

''ఒరేయ్! రామూ వీపు మీద ఎక్కితే హెడ్మాస్టారు తంతార్రా!'' అన్నాడు శీను.

కొద్ది దూరంలో గడపలో కూర్చుని బియ్యం ఏరుకుంటున్న వాళ్ళమ్మ ఇవన్నీ చూస్తూ ''ఫర్వాలేదు ఎక్కు. ఆటల్లో అందరూ సమానమే!'' అని ప్రోత్సహించింది.




ఆ రోజుల్లో వేసవికాలం శలవుల్లో బ్రహ్మంగారి ఆరాధన ఉత్సవాలు జరిగేవి. నవరాత్రులు..తొమ్మిది రోజులు తొమ్మిది నాటకాలు వేసేవాళ్ళు.

హరిశ్చంద్ర, చింతామణి, బాలనాగమ్మ, తులాభారం, వాలి-సుగ్రీవ మొదలైన నాటకాలు వేసేవాళ్ళు. ఆ రోజు కోసం ఎప్పుడెప్పుడు వస్తుందా? అని అందరూ ఎదురు చూసేవాళ్ళు.

ఉదయం పూట పెద్ద ప్రభ కట్టి ఊళ్ళో ఊరేగించేవారు. పిల్లలు కూడా చిన్న చిన్న ప్రభలు కట్టి వాటి వెనకే తిరిగేవాళ్ళు. ఉదయం ఎనిమిది గంటలకల్లా తలంటి పోసుకుని, కొత్త బట్టలు వేసుకుని గుడి దగ్గరకు వెళ్ళే వాళ్ళు.

ప్రభ బండి ఊరేగుతుంటే ఆడవాళ్ళు బిందెలతో నీళ్ళు కింద కుమ్మరించి, కొబ్బరికాయలు, అరటిపళ్ళు, పసుపు కుంకుమ, అగరొత్తులు అందించేవారు. నాలుగు రోడ్ల కూడలి దగ్గర బండి ఆగేది. కోలాటం ప్రదర్శించేవారు.

ఇక సాయంత్రం అయిదంటే పిల్లలందరి ఉత్సాహం చెప్పనలవికాదు. గుడి దగ్గర మైకులు పెట్టి పాటలు వేస్తుంటే అందరూ అక్కడే సందడి సందడిగా గంతులు వేస్తూ ఆడుకునే వాళ్ళు.

అప్పట్లో కేశవరావు వాళ్ళ ఇంటి ముందు పూలచెట్ల మధ్య గడ్డి వత్తుగా పెరిగేది. వెన్నెల్లో, గడ్డిలో గుండ్రంగా కూర్చుని కేశవరావు వాళ్ళ కుటుంబ సభ్యులు, వసుంధర వాళ్ళ కుటుంబ సభ్యులు అందరూ కలిసి భోం చేసేవాళ్ళు.

వసుంధర వాళ్ళ అక్క గోంగూర పచ్చడి వేసి కలిపి, పిల్లలందరికీ ముద్దలు చేసి చేతిలో పెట్టేది. ''ఊc....ఊc...! త్వరగా తినండి. మనందరం నాటకానికి వెళదాం'' అనేది.

దాదాపు రాత్రి పదింటికి నాటకం మొదలవుతున్నట్లుగా ''పారాబ్రహ్మపరమేశ్వర'' అంటూ ప్రార్థనా గీతం మైకులో వినిపించేది. ఊళ్ళోని ఆడవాళ్ళు, మగవాళ్ళు అందరూ గుంపులు గుంపులుగా వెళ్ళేవాళ్ళు.

కొంచెం సేపు చూసి పిల్లలందరూ అమ్మల ఒళ్ళో నిద్రపోయేవాళ్ళు. పెద్దవాళ్ళు తెల్లవార్లూ చూసి తెలతెలవారుతుండగా ఇంటికి వచ్చి, కాళ్ళు కడుక్కుని అప్పుడు నిద్రకి ఉపక్రమించేవాళ్ళు.

హైస్కూల్ వరకూ అందరూ కలసిమెలసి పెరిగారు. టెంత్ క్లాస్ అయిపోగానే భానుమతికీ, కుసుమకీ పెళ్ళిళ్లయినాయి. రామూ వాళ్ళకీ ట్రాన్స్‌ఫర్ అయింది. గోపికి వ్యాపారం నేర్పుతానని వాళ్ళ మేనమామ ఊరికి తీసుక వెళ్ళాడు.

వసుంధర వాళ్ళూ, కేశవరావు వాళ్ళూ చాలా కాలం స్నేహంగా ఉన్నారు.

వసుంధర వాళ్ళ నాన్న పోయినప్పుడు తమ కుటుంబ సభ్యుడినే పోగొట్టుకున్నట్లు చాలా బాధ పడ్డారు. వసుంధర వాళ్ళ అక్కలకి కూడా పెళ్ళిళ్ళయి పోవడం, తను డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగాల వేటలో పడటం, గుండపోటుతో తండ్రి హఠత్తుగా చనిపోవడం, ఆ బాధలో నుంచీ కోలుకోకుండానే తల్లి కూడా మరణించడం, అన్ని సంఘటనలూ త్వరత్వరగా జరిగిపోయాయి.

తర్వాత తనకి ఉద్యోగం రావడం, ఊరు వదలి వెళ్ళిపోవడం, పెళ్ళి కావడం, పిల్లలు పుట్టడం, వాళ్ళు పెద్ద కావడం, మనుమలు పుట్టడం చూస్తుండగానే సంవత్సరాలు తిరిగిపోయాయి. ఇప్పుడు తనకీ ఒంటరితనం. ఈ ముప్పై ఏళ్ళలో ఎన్నో వేల మైళ్ళు ప్రయాణం చేసినట్లుగా ఉంది.

ఎన్ని ఊళ్ళు మారినా, ఎంత దూరం వెళ్ళినా తన మనసు పుట్టిన ఊరినీ, ఆ పరిసరాలనీ, ఆ అనుభూతులనీ తలచుకుంటూనే ఉంది. ఆ ఆలోచనలు సువాసనాభరితంగా, పూలతెప్పలో తేలిపోతున్నట్లుంటాయి.

ఒక్కసారి ఆ ఊరు వెళ్ళి చూడాలని ఎంతగానో అన్పిస్తుంది. ఇప్పుడు రాము, గోపీ, శీనూ, కుసుమ అందరూ ఏం చేస్తుంటారో? కేశవరావుకు జరిగిపోయిన సంఘటనలన్నీ గుర్తొచ్చాయి.

కొడుకు స్నానానికి వెళుతూ టవల్ కోసం వచ్చాడు.

''ఒరేయ్ కృష్ణుడు! కవెవరం ట్రాన్స్‌ఫర్ చేయించుకోరా! మన ఊరు వెళ్ళి ఉందాం'' అన్నాడు.

'' ఏమిటి నాన్న నీ చాదస్తం! సిటీకి అలవాటయిన వాళ్ళు ఆ పల్లెటూర్లో ఎలా ఉండగలరు? ఆ ఖాళీ స్థలం కూడా ఎప్పుడో అమ్మేస్తా!'' అన్నాడు

''అంత మాట అనకురా నాయన! ఆ ఊళ్ళోపుట్టాను...అక్కడే ఆడుకున్నాను...అక్కడే పెరిగాను... అక్కడే ఈ ఘటం వెళ్ళిపోతేనే నా ఆత్మకశాంతి'' భారంగా అన్నాడు కేశవరావు.

*